విద్యార్థిని ఆత్మహత్య

బంగారపేట, మే 11: ఎస్ఎస్ఎల్సీ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థిని మనస్థాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణంలోని విజయ నగర నివాసి కావ్య (16) ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో తీవ్ర విచారానికి లోనైంది. శనివారం ఉదయం ఎంతసేపటికీ నిద్ర లేచి రాలేదు. దీంతో గది తలుపులు పగులగొట్టి చూడగా ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కావ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక ఆత్మహత్యతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెద్దల సభకు పోటాపోటీ



- రాష్ట్రంలో మరో ఎన్నికల వేడి
- పరిషత్ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్
- 11 ఎమ్మెల్సీ స్థానాలకు.. 50మంది ఆశావహులు

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రశాంతంగా గడుపుదామని భావించిన రాజకీయ నేతలకు వెంటనే ఎమ్మెల్సీ ఎన్నికలు వేడి పుట్టిస్తున్నాయి. రాష్ట్ర శాసనసభ్యులనుంచి విధానపరిషత్‌కు 11మంది సభ్యుల ఎన్నిక చేసే ప్రక్రియకు ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ వెలువడనుంది. బీజేపీకి చెందిన ఆరుగురు, కాంగ్రెస్‌కు చెందిన నలుగురు, జేడీఎస్‌కు చెందిన ఒకరు జూన్ 17న పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం శాసనసభ్యుల సంఖ్య మేరకు కాంగ్రెస్‌కు 7-8 స్థానాలు లభించే అవకాశం ఉంది. అందుకోసం కులం, మతం, ప్రాంతీయ కోటాలో పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో తండ్రి సీఎం సిద్దరామయ్య కోసం వరుణ నియోజకవర్గాన్ని వదులుకున్న యతీంద్ర సిద్దరామయ్య పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇక కేపీసీసీ మీడియా విభాగం సంచాలకులు, అధికార ప్రతినిధి రమేశ్‌బాబు, కేపీసీసీ కోశాధికారి వినయ్ కార్తీక్, కేపీసీసీ మీడియా విభాగం సహ అధ్యక్షులు ఐశ్వర్య మహదేవ్, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆగా సుల్తానా, నేషనల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, కేపీసీసీ పాలనా విభాగం జనరల్ సెక్రటరీ విజయ్ ములుగుంద్, న్యాయవాది సీఎస్ ద్వారకనాథ్, మహిళా కాంగ్రెస్ నేత కమలాక్షి రాజణ్ణ, దేవరాజ్ అరసు మనవడు, గ్యారెంటీ పథకాల ప్రాధికార ఇన్‌చార్జ్ సూరజ్ హెగ్డే, ప్రవాస భారతీయ ఫోరం ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఆరతికృష్ణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుష్ప అమరనాథ్‌ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఎగువసభలో మరో కీలకమైన పదవి ఎవరికి దక్కుతుందనేది కుతూహలంగా మారింది. ప్రస్తుతం పరిషత్ సభా నాయకుడిగా వ్యవహరిస్తున్న మంత్రి బోసరాజు పదవీకాలం ముగియనుంది. దీంతో రానున్న శాసనసభ సమావేశాలనాటికి మరొకరిని సభానాయకుడిని చేయాల్సి ఉంది. సభానాయకుడిని చేయడం ద్వారా మంత్రి పదవి కూడా వరించనుంది. ప్రస్తుతం ఎమ్మెల్సీలలో బోసరాజు మినహా మరెవ్వరూ మంత్రులు లేరు. సిట్టింగ్ ఎమ్మెల్సీ సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు మూడోసారి పరిషత్ సభ్యుడి హోదా కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇటీవలే బీజేపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిన తేజస్వినిగౌడ, కేపీ నంజుండిలు కూడా అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

బీజేపీ, జేడీఎస్ నేతల్లో అయోమయం..

బీజేపీ, జేడీఎస్ నేతల్లో మైత్రిపై అయోమయం నెలకొంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడకముందే జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రాసలీలల వివాదం నేపథ్యంలో బీజేపీ-జేడీఎస్‌లు విడిపోనున్నాయనే సంకేతాలు వచ్చినా కలసి ముందుకెళ్లాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. 3 ఉపాధ్యాయ, 3 పట్టభద్రుల స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. వీటిలో నలుగురు బీజేపీకి, ఇద్దరు జేడీఎస్ అభ్యర్థులను ఎంపిక చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు మైత్రి ద్వారా ఏడుగురు సభ్యులను ఎంపిక చేసి బీజేపీ 4, జేడీఎస్ 3ని ఎంపిక చేసుకోవాలని భావించారు. అయితే బెంగళూరు ఉపాధ్యాయ స్థానం నుంచి ఎన్డీయే అభ్యర్థిగా జేడీఎస్‌కు చెందిన ఏపీ రంగనాథ్ కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణపై ఓటమి చెందిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 6 స్థానాలకు గాను దాదాపు అభ్యర్థులు ఖరారైనట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి ఈశాన్య పట్టభద్రుల స్థానానికి అమరనాథ్ పాటిల్, బెంగళూరు పట్టభద్రుల స్థానం నుంచి ఏహెచ్ ఆనంద్, ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి డాక్టర్ వైఏ నారాయణ స్వామి, నైరుతి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి డాక్టర్ ధనంజయ్ సర్జీ, లేదా రఘుపతి భట్, లేదా వికాస్ పుత్తూరులలో ఒకరికి అవకాశం కల్పించనున్నారు. జేడీఎస్ నుంచి నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గానికి మరోసారి ఎస్ఎల్ భోజేగౌడ, దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి మరోసారి కేటీ శ్రీకంఠేగౌడలకు అవకాశం కల్పించనున్నారు.


పదవీ కాలం ముగియనున్న ఎమ్మెల్సీలు

కాంగ్రెస్‌కు చెందిన అరవింద్‌కుమార్ అరలి, ఎన్ ఎస్ బోసరాజు, గోవిందరాజు, హరీశ్‌కుమార్, బీజేపీకి చెందిన రఘునాథరావు మల్కాపుర, రవికుమార్, రుద్రగౌడ, మునిరాజుగౌడ, జేడీఎస్‌కు చెందిన బీఎం ఫరూఖ్‌ల పదవీ కాలం జూన్ 17 నాటికి ముగియనుంది. పదవీకాలం ముగిసే సభ్యుల్లో తేజస్వినిగౌడ, కేపీ నంజుండిలు ఇటీవలే పరిషత్ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

పరిషత్‌లో బలాబలాలు ఇలా..

ప్రస్తుతం పరిషత్ సభాపతితో కలిపి 75మంది సభ్యులు ఉండాల్సి ఉంది. సభలో 70మంది ఎమ్మెల్సీలు ఉండగా ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన పరిణామాలతో పలువురు రాజీనామా చేశారు. ఖాళీ అవుతున్న 18 స్థానాలకు సంబంధించి 11మంది ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైనవారు కాగా మిగిలినవారు ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు చెందినవారు. శాసనసభలో 136మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో 8మంది ఎమ్మెల్సీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. బీజేపీ, జేడీఎస్‌ల మైత్రి నలుగురికి మాత్రమే ఎంపిక చేసుకునేందుకు వీలుంది. కాంగ్రెస్‌కు ప్రస్తుతం పరిషత్‌లో 29మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. శాసనసభ కోటాలో 8మందిని గెలిపించుకుంటే మెజారిటీ సాధ్యం కానుంది. ప్రతి నియోజకవర్గానికి ఇప్పటికే ఇద్దరు ముగ్గురి పేర్లతో జాబితా సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపిన బీజేపీ, అగ్రనేతల నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది.

సందిగ్ధం..!



- పరిషత్ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ పొత్తు కొనసాగేనా..?
- ప్రజ్వల్ వివాదంతో కమలం నేతల్లో అయోమయం



బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొత్తు రాజకీయాలు కొత్త కాకపోయినా దాదాపు దశాబ్దన్నర కాలం తర్వాత బీజేపీ-జేడీఎస్‌ల మైత్రి అనూహ్యంగా కుదిరింది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలతోపాటు ప్రాంతీయ పార్టీ జేడీఎస్ కీలకంగా ఉన్నాయి. ఎన్నికలు ముగిశాక అవసరాన్ని బట్టి జేడీఎస్ పార్టీ కాంగ్రెస్, బీజేపీలతో జతకట్టే ఆనవాయితీ కొనసాగుతోంది. ఇలాగే బీజేపీతో కలసి ఓసారి, కాంగ్రెస్‌తో కలసి 2018లో జేడీఎస్ నేత కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే భిన్నంగా ఎన్నికలకు ముందే బీజేపీ - జేడీఎస్ పార్టీలు పొత్తుతో ముందుకెళ్లాయి. లోక్‌సభ ఎన్నికల్లో చిన్నపాటి సమస్యలు వచ్చినా కలసి ముందుకెళ్లారు. కేంద్రంలో మరోసారి బీజేపీ వస్తుందనే విశ్వాసంతో శాశ్వతంగా కలసి ఉండాలని జేడీఎస్ నేతలు భావించారు. అందుకు అనుగుణంగానే జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ అల్లుడు జయదేవ ఆసుపత్రుల మాజీ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బీజేపీ నుంచే బెంగళూరు గ్రామీణనుంచి పోటీ చేయించారు. అయితే దేవెగౌడ మనవడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదం తర్వాత కలసి ఉండాలని జేడీఎస్ భావిస్తున్నా బీజేపీ మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి నుంచి రాహుల్‌గాంధీ దాకా నాయకులంతా జేడీఎస్‌కు చెందిన దేవెగౌడ కుటుంబానికంటే బీజేపీ నేతలను టార్గెట్ చేశారు. రాష్ట్ర బీజేపీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు ఈ విషయమై స్పందించాలని పట్టుబట్టారు. తొలివిడత ఎన్నికల తర్వాత వివాదం బహిర్గతమయ్యింది. బీజేపీని గుక్కతిప్పుకోకుండా ఇదే ప్రధానఅస్త్రంగా కాంగ్రెస్ ప్రయోగించింది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జేడీఎస్‌తో కలసి నడవాలా లేదా తెగదెంపులు చేసుకోవాలా అనే ఆలోచనలో బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ అగ్రనేతలు కూడా దీనిపై స్పష్టతకు రావడం లేదు. కాగా ప్రస్తుతం జేడీఎస్ కు 19మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది ప్రజ్వల్‌ను వెనకేసుకొస్తే పూర్తిగా మునిగిపోతామని, తమ భవిష్యత్తు రాజకీయాలు చూసుకుంటామని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దీంతో జేడీఎస్‌ను విలీనం చేయాలా..? లేదా బీజేపీ నుంచి విడిపోవాలా..? అనే ఆలోచనలో జేడీఎస్ నేతలు కూడా ఆలోచిస్తున్నారు. ఈలోగానే ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

పోలీసుల అదుపులో న్యాయవాది దేవరాజెగౌడ




- లైంగిక దౌర్జన్యాలపై ఫిర్యాదు
- 14 రోజుల కస్టడీకి తరలింపు

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్‌ల విడుదల వెనుక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ హస్తం ఉందని బహిరంగంగా ఆరోపించిన హాసన్‌కు చెందిన న్యాయవాది, బీజేపీ నాయకుడు దేవరాజెగౌడను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంటిస్థలం మార్పునకు సంబంధించి న్యాయవాది దేవరాజెగౌడను సంప్రదించినవేళ లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఏప్రిల్ 1న హొళెనరసీపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కులం పేరుతో దూషణ మేరకు మరో కేసు ఉంది. ఇటీవలి మార్చిలో జిల్లా అధికారి సత్యభామ ప్రభుత్వ విధులకు అడ్డుపడుతున్నారని హాసన్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి చిత్రదుర్గ జిల్లా హిరియూరులో అదుపులోకి తీసుకుని హొళెనరసీపురకు తరలించారు. హొళెనరసీపుర ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం విచారణ చేపట్టారు. ఎస్పీ మహ్మద్ సుజిత, ఏఎస్పీ వెంకటేశ్‌నాయుడు, డీఎస్పీ అశోక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ విచారణ చేస్తున్నారు. హొళెనరసీపుర పోలీస్ స్టేషన్‌కు దేవరాజెగౌడను తరలించగా పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలు ఆయన అభిమానులు, బంధువులు వచ్చారు. అనంతరం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టడంతో 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించాల్సి వచ్చింది. ముందు జాగ్రత్తగా కేఎస్ఆర్పీ బలగాలను రంగంలోకి దించారు.

పార్టీలు వేరైనా స్నేహబంధం కొనసాగించాం..

- దళితుల కోసం నిరంతర కృషి చేసిన మహానేత
- శ్రీనివాస ప్రసాద్ వర్ధంతి సభలో సీఎం




శ్రీనివాసప్రసాద్ చిత్రపటం వద్ద కొవ్వొత్తి వెలిగిస్తున్న సీఎం సిద్దూ

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): తమ మధ్య రాజకీయ వైషమ్యాలున్నా స్నేహ బంధానికి ఎటువంటి భంగం కలగలేదని, కల్మషం లేని ఆయన మనస్తత్వంతోనే అది సాధ్యమయ్యిందని శ్రీనివాసప్రసాద్ వర్ధంతి సభలో సీఎం అభిప్రాయపడ్డారు. మైసూరులో శనివారం శ్రీనివాస ప్రసాద్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాసప్రసాద్ సేవలను కొనియాడారు. వెనుకబడినవర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన ఆయన మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహదేవప్ప, వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజకీయ సమాధి అసాధ్యం

రాజకీయంగా ఎవరూ మరొకరిని సమాధి చేయలేరని పైకి ఎదిగినవారు కిందకు దిగక తప్పదని సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. వర్ధంతి కార్యక్రమం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రధాని మోదీ ప్రతిపక్షాలను విమర్శించడంపై ఆయన ఘాటుగా స్పందించారు. మోదీ పదేళ్ల పాలనలో పేదలకు చేసిందేమీ లేదన్నారు. ప్రధానమంత్రిని ఓడించాలనేది ప్రతిపక్షాల ఆశయంగా ఉంటుందన్నారు. ఓటమి భయం ప్రధానిని వెంటాడుతోందన్నారు. ప్రధాని అబద్ధాలకోరు అనేది అందరికీ తెలిసిందేనన్నారు. రైతు రుణమాఫీ చేయాలనే బీజేపీ నేత యడియూరప్ప డిమాండ్‌కు గతంలో సీఎంగా ఉన్నప్పుడు మా వద్ద నోట్ల ప్రింటింగ్ మిషన్ లేదని వ్యాఖ్యానించారని, ఆయనకు డిమాండ్ చేసే నైతికత ఉందా అని ప్రశ్నించారు.

ఆత్మీయ పలకరింపు

పార్టీలు వేరైనా. రాజకీయంగా మాటల తూటాలు పేల్చుకున్నా తారసపడితే మాత్రం అభిమానంగా మాట్లాడుకునే సంప్రదాయాన్ని పాటించే సిద్దరామయ్య అదే వైఖరి కొనసాగించారు. శ్రీనివాస ప్రసాద్ వర్ధంతి సభకు మాజీ సీఎం యడియూరప్పను ఆత్మీయంగా పలకరించి ఆకట్టుకున్నారు. వేదికపై ఒకరి పక్కన ఒకరు కూర్చొని, చేతిలో చేయి వేసుకుని అభిమానం చాటిచెప్పారు. జేడీఎస్ నేత జీటీ దేవెగౌడ సీఎం కంటే ముందే వచ్చి వెళ్లారు.

క్కపోత నుంచి ఉపశమనం




నగరంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

విజయపుర, మే 11: మండుతున్న ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న నగర ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. బెంగళూరులో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రంతా కురిసిన వర్షంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. రెండు రోజులుగా కురుస్తున్న జల్లులతో వేడితో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత వర్షం కురవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వర్షం కురవడంతో విధులనుంచి ఇళ్లకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోత అధికం కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గాలివాన కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. దెబ్బతిన్న విద్యుత్‌స్తంభాలను బాగు చేయాలని కోరుతున్నారు. మరోవైపు వర్షం కారణంగా బస్సుల సమయానికి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


విజయపుర టౌన్‌హాల్ సర్కిల్‌లో వర్షం



బెంగళూరు నగరంలోని ఆర్టీ నగర్‌లో ఈదురు గాలులకు కూలిన భారీ వృక్షాలు




వేదికపై డీకే శివకుమార్, రఘువీరారెడ్డి

మడకశిర అభివృద్ధి నా బాధ్యత

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక దృష్టి సారిస్తా
- ఎన్నికల ప్రచారంలో డీసీఎం డీకే శివకుమార్ హామీ

రొళ్ల, మే 11: నిత్యం కరువుతో విలవిలలాడే మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని, ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ప్రత్యేక నిధులు తెస్తానని కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్ హామీ ఇచ్చారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారసభలో ఆయన మాట్లాడారు. సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్ రఘువీరారెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ విజయం సాధిస్తేనే, ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్య, రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తి అవుతాయన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉండే గడినాడు కన్నడిగులుగా గుర్తింపు తీసుకొచ్చే బాధ్యతతో పాటు కుంచటిగ ఒక్కలిగుల కేంద్ర జాబితాలో ఓబీసీలో చేర్చడానికి కృషి చేస్తానన్నారు. ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఢిల్లీ పెద్దలతో మాట్లాడి మడకశిర ప్రాంత ప్రజల కష్టసుఖాలను తీర్చేబాధ్యత తాను తీసుకుంటానన్నారు. మాజీ మంత్రి రఘువీరా మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం ఒక్క ఓటుకు రూ. 1500 ఇస్తున్నారని, డబ్బులు చూసి కాక అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు. వైసీపీ, టీడీపీ పార్టీలు ఓట్ల కోసం అనేక రకాలుగా ఈ ప్రాంత ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే భవిష్యత్తులో నియోజకవర్గంలోని ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి ఎదురుగాలి వీస్తుందని, ఆ పార్టీకి ఓటమి తప్పదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్, ఎంపీ అభ్యర్థి షాహిన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కర్ణాటక మంత్రి కేఎన్ రాజన్న, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

నీళ్లు రాకపాయ... చెరువు ఎండిపాయ


పాముురాయి చెరువు

ఇక్కడ కనిపిస్తున్నది అనంతపురం రూరల్ మండలం పాముురాయి చెరువు. పూర్తిగా ఎండిపోయింది. ఈ దుస్థితికి నేటి పాలకులే కారణమని గ్రామస్థులు మండిపడుతున్నారు. 2009 నుంచి 2019 వరకు పరిటాల సునీత ఎమ్మెల్యే, మంత్రిగా పదేళ్ల పాటు పనిచేశారు. ఈ కాలం చెరువు ఎండకుండా ఏదో విధంగా హెచ్చెల్సీ నీటిని తెప్పించేవారని వారు చెబుతున్నారు. చెరువులో నీరు ఉండటంతో చేపల పెంపకం బాగా పెరిగి సొసైటీకి ఆదాయం చేకూరేది. భూగర్భ జలాలు పెరిగి పంటలకు నీటి ఎద్దడి లేకుండా ఉండేదని రైతులు అంటున్నారు. గత రెండేళ్లుగా చెరువుకు చుక్క నీరొచ్చింది లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరులేక చెరువు వెల..వెలబోతోందని వారు పేర్కొంటున్నారు.

- అనంతపురంరూరల్

ఓటరు కార్డు లేకుంటే.. వీటిలో ఏదో ఒకటి..




ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో ఓటరు పేరు తప్పని సరిగా ఉండాలి. అలాగే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలి. ప్రస్తుతం ఓటరు స్లిప్‌లను కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే ఓటరు కార్డు అందుబాటులో లేకున్నా ఎన్నికల్లో ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. పోలింగ్ రోజున సమయానికి ఓటరు కార్డు దొరక్కపోతే లేదా పోగొట్టుకుంటే ఆ సమయంలో ఓటు హక్కు అవకాశాన్ని చేజార్చుకోవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటరు నమోదు చేసుకున్న వ్యక్తులు సమయానికి ఓటు కార్డు లేకపోయినా 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉన్నా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

- అనంతపురం అర్బన్/ రూరల్

- ఆధార్ కార్డు
- పాన్‌కార్డు
- డ్రైవింగ్‌లైసెన్స్
- సేవా గుర్తింపు కార్డు
- ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు
- ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు
- పాస్‌పోర్ట్
- పెన్షన్ డాక్యుమెంట్స్
- ఉపాధి హామీ జాబ్‌కార్డు
- ఎన్‌పీఆర్ కింద ఆర్టీఐ
- జారీ చేసిన స్మార్ట్ కార్డు
- బ్యాంకు, పోస్టాఫీసు పాస్‌బుక్
- ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికలకు అధికారులు జారీ చేసిన ప్రత్యేక గుర్తింపు కార్డులు

సోమవారం మీ కత చెప్తాం..



అనంతపురం సెంట్రల్, మే 11: సార్వత్రిక ఎన్నికలవేళ వీధివీధిన డబ్బుల గొడవలు నెలకొంటున్నాయి. వైసీపీ నాయకులు ఓట్లు కొనుగోలుకు డబ్బులు పంచడంతో డబ్బులందని వారు దూషణలకు దిగుతున్నారు. ప్రాంతాల వారిగా ఓటర్ల సంఖ్య లెక్కగట్టి ఒక్కో ఓటుకు రూ.2వేల చొప్పున పంచుతున్నారు. ఈ క్రమంలో వీధిలోని కొంతమందికి ఇచ్చి మరికొంతమందికి ఇవ్వక పోవడంతో ప్రజలు ఆగ్రహిస్తున్నారు. మాకెందుకు ఇవ్వలేదని వైసీపీ నాయకులను నిలదీస్తున్నారు. వాళ్లే ఓటర్లా? మేము కనడబడలేదా అని ప్రశ్నిస్తుండటంతో డబ్బులివ్వడానికి వచ్చినవారు అక్కడి నుంచి జారుకుంటున్నారు. మీ నాయకుడు ఎలా గెలుస్తారో మేముకూడా సోమవారం చెబుతామని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

భలే వ్యాపారం



ఎన్నికల పోటీలో నిలబడిన అభ్యర్థులు కొంతమంది నాయకులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. మా ప్రాంతంలో ఇంతమంది ఓటర్లున్నారు. ఇంతమొత్తం అవుతుందని సొమ్ము తీసుకు వచ్చిన నాయకులు కొంతమంది ఓటర్లకే పంచి, మిగిలి సొమ్మును జేబులోకి వేసుకుంటున్నారు. పైకి మాత్రం అందరికీ పంచినట్లు అభ్యర్థులకు లెక్కలు చూపుతున్నారు. ఎన్నికల్లో నాయకులుగా చెప్పుకుని పంపిణీ పేరుతో భలే వ్యాపారం చేసుకుంటున్నారు.

అనంతపురం
శ్రీ సత్యసాయి
ఆదివారం 12 మే 2024
జన కేతనం
ఆంధ్రజ్యోతి

లక్ష ఎకరాలకు నీరెక్కడ తోపూ..!

- పేరూరు డ్యాంను నీరుగార్చారు..
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపు
- నీరు ఇచ్చానని ఊదరగొడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి





ఆత్మకూరు, మే 11 : పేరూరు డ్యాంకు నీళ్లు ఇచ్చి రాప్తాడు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తానని ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరూరు డ్యాంను నీరుకార్చడమే కాకుండా మూడు డ్యాంల పేరుతో పంగనామాలు పెట్టారని మండిపడుతున్నారు. ఐదేళ్లపాలనలో సొంత గ్రామం తోపుదుర్తి డ్యాం కలగానే మిగిలిపోయింది. తట్టెడు మట్టికూడా తీయలేదు.. భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఎదురుచూసి అలసిపోయారు. పేరూరు కాలువ పనులు వైసీపీ అధికారంలోకి రాగానే నిలిచిపోయాయి. రాప్తాడు నియోజకవర్గంతో పాటు పరిసర మండలాల రైతులకు మేలు చేకూర్చేలా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పని చేసిన పరిటాల సునీత ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 2018లో ప్రభుత్వం రూ.804 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. జీడిపల్లి జలాశయం నుంచి 51 కిలో మీటర్లు కాలువ నిర్మాణం, నాలుగుచోట్ల లిఫ్టులు, నాలుగుచోట్ల జలాశయాలకు అనుమతులతో నిర్మాణానికి చర్యలు చేపట్టి సగానికి పైగా పనులు పూర్తి చేశారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాలువ పరిధిలో కొన్ని జలాశయాలు రద్దు చేసి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మరోసారి 2023 డిసెంబరులో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి వద్ద వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కాలువ పనులు, రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి వదిలేశారు.


వృధాగా ఉన్న లిఫ్టు గేట్లు

కాంట్రాక్టర్లు పనులు చేశారు. వారికి బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిపేసి వెళ్లిపోయారు. దీంతో కాలువ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందగా మారాయి.

రైతులకు అందని పరిహారం

రైతులు తమ భూముల్లో కాలువ పనులు జరిగితే పంటలకు అనుకూలంగా ఉంటుందని కోటి ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతులు ఆశలపై నీళ్లు చల్లారు. కాలువ పనులకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఐదేళ్లు గడిచినా పనులు చేయలేదు. రైతులకు డబ్బులు ఇవ్వలేదు. సాగునీటి కోసం లక్షలు విలువ చేసే భూములను కాలువ కోసం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వదిలేయడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. భూమి సాగుకు పనికి రాకుండా కాలువ తవ్వి వదిలేశారు.

పరిహారం డబ్బులు రాలేదు

మా పొలంలో కాలువ పనులుపూర్తి చేశారు. ఇప్పటికీ డబ్బులు రాలేదు. ఆరు ఎకరాలు పొలం కాలువకు ఇచ్చాం. నీళ్లువస్తాయని ఆశపడినా ఫలితం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పట్టించుకొనేవారు లేరు. కాలువ పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి. నాతో పాటు చాలామంది రైతులు చాలామంది స్వచ్ఛందగా కాలువ కోసం భూములు ఇచ్చాం.

- అక్కులన్న, ఆత్మకూరు

అసంపూర్తిగా లిఫ్టులు

జీడిపల్లి నుంచి పేరూరు డ్యాం వరకు నాలుగు లిఫ్టుల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఆత్మకూరు సింగనగుట్ట దగ్గర లిఫ్టు పనులు నిలిచిపోయాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పనులు ప్రారంభించారు. కోనాపురం, బాలవెంకటాపురం వద్ద లిఫ్టు పనులు చేయాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి రాగానే పేరూరుడ్యాం కాలువ పనులు మరుగున పడ్డాయి. ప్రారంభంలో కొంత మంది


కలగానే ముట్టాల డ్యాం

ముట్టాల గ్రామంలో డ్యాం నిర్మాణం కలగానే మిగిలిపోయింది. డ్యాం వస్తుందని ఆశపడ్డాం, కాగితాలకే పరిమితం చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతులను డ్యాం పేరుతో ఊరించారు. తర్వాత వదిలేశారు. భూగర్భజలాలు తగ్గిపోయి పంటలు పండించుకొనే రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రజలను మోసగించే పనులు చేస్తే సహించరు. రైతులను మోసం చేయడం మంచిదికాదు.

- చిన్న అక్కులప్ప, ముట్టాల

ప్రతి పనికీ కప్పం కట్టాల్సిందే..!

- కళ్యాణదుర్గంలో దోచేసి.. పెనుకొండకు..
- గెలిస్తే సొంత పార్టీ నాయకులపైనే కేసులు
- మంత్రి ఉష శ్రీచరణ్‌పై మండిపడుతున్న వైసీపీ నేతలు



హిందూపురం, మే 11 : గతంలో ఏ ప్రభుత్వంలో జరగని అవినీతి అక్రమాలు, భూదందాలు, కబ్జాలు, ఈ ఐదేళ్లలో జరిగాయి. వైసీపీ నాయకుల ఆగడాలకు జనం విలవిలలాడారు. ఈ పరిస్థితుల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలను బదిలీ చేశారు. ఎన్నోచోట్ల ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచినా, ఓడినా వారి స్థానాల్లోనే పోటీచేసేవారు. ఈసారి జగన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. 2019 నుంచి 2023 వరకు నియోజకవర్గాల్లో సామంత రాజులుగా ఏలిన వైసీపీ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కొంత మందిని వదులుకోలేక మరో నియోజకవర్గానికి బదిలీ చేశారు. అలాంటి బదిలీనే పెనుకొండలో ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఉషశ్రీ పరిస్థితి. ఈమె కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా కూడా కొనసాగుతున్నారు. ఆ నియోజకవర్గంలో ప్రతి పనికి కప్పం కట్టాల్సిందే. ఆఖరికి సొంత పార్టీ నాయకులను కూడా వదల్లేదు. ఎవరైనా ఎదురు చెబితే వారిపై కేసులు పెట్టించారు. ఈ పరిస్థితుల్లో ఆ నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో అసమ్మతిరాగం వినిపించడంతో అధిష్టానం ఈమెను పెనుకొండకు పంపింది. ఇక్కడ మంత్రిగా పనిచేసిన శంకరనారాయణను అనంతపురం పార్లమెంట్‌కు బదిలీ చేసింది. అక్కడి చెత్త తీసుకొచ్చి ఇక్కడ వేసినంత మాత్రాన బంగారం ఎలా అవుతుందని సొంత పార్టీ నాయకులతోపాటు ప్రతిపక్ష పార్టీలు, సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

కళ్యాణదుర్గాన్ని దోచేసి..

ఉషశ్రీచరణ్ 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పలు రకాలుగా దోచేశారు. ఇసుక, మట్టి, భూదందాలు, ఏ చిన్న పనిచేయాలన్నా ఆమెకు కొంత మొత్తం సమర్పించుకోవాల్సిందేనని సొంత పార్టీ నాయకులే అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లేఅవుట్ వేయాలన్నా, భూమి కొనాలన్నా, ఇళ్లు నిర్మించుకోవాలన్నా ఆమెకు కప్పం కట్టాల్సిందే. లేదంటే అధికారులను ఉసి గొలిపి ఏదో కొర్రిపెట్టి పనులు అడ్డగించడం సర్వసాధారణమైంది. ఈ పరిస్థితుల్లో అధిష్ఠానం గుర్తించి పెనుకొండకు బదిలీ చేశారు. ఇక్కడికి వచ్చిన కొద్దిరోజులకే ఇలాంటి వాటికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గానికి వచ్చి రాగానే తాడిపత్రికి చెందిన ఓ రియల్టర్ లేఅవుట్ వేస్తుంటే అందులో తక్కువ ధరకు ప్లాటు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. వారు ససేమిర అనడంతో రాత్రికి రాత్రే తన అనుచరులు లేఅవుట్‌లో నాటిన రాళ్లను పెకలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది అధికారుల ద్వారా భూములకు సంబంధించి కొల్లగొట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో దానికి ఫుల్‌స్టాప్ పడినట్లు పెనుకొండలో చర్చనీయాంశంగా మారింది. దీంతోపాటు పెనుకొండ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులపై కక్షసాధింపు... కర్రపెత్తనం సాగిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ ముందే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా సొంత సామాజిక వర్గానికి చెందిన, ఇక్కడ పనిచేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ పేరు బోర్డుపై ఉంటే తట్టుకోలేని మనస్తత్వం మంత్రిదంటూ ఆ కులస్థులే విమర్శిస్తున్నారు. అనతి కాలంలోనే పెనుకొండ నియోజకవర్గంలో సామంతరాజులాగా వ్యవహరించడం ప్రారంభించారు. ఇక్కడ కూడా అధికార పార్టీకి చెందిన బలమైన సామాజికవర్గాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో ఇదే విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి కూడా ఓ ముఖ్య నాయకుడు తీసుకెళ్లాడు.

ప్రతిపనికీ కప్పం కట్టాల్సిందే..

పెనుకొండలో ఆమె గెలవకూడదని కళ్యాణదుర్గంకు చెందిన వైసీపీ నాయకులే ఇక్కడికి వచ్చి వారి బంధువులు, స్నేహితుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆమె ఒక వేళ గెలిస్తే పెనుకొండ నియోజకవర్గాన్ని దోచేస్తుందంటూ చెబుతున్నారు. అటెండర్ ఉద్యోగి బదిలీ కావాలన్నా, ఆమెకు ముడుపులు సమర్పించుకోవాలని, ప్రతిపనికి కప్పం కట్టాల్సిన పరిస్థితి వస్తుందంటూ హెచ్చరిస్తున్నారు. గత 15రోజులుగా కళ్యాణదుర్గానికి చెందిన పదుల సంఖ్యలో నాయకులు ఇక్కడికి వచ్చి ఆమె పనితీరు, అక్కడ బీసీ వర్గీయులతో పాటు సొంత పార్టీ నాయకులకు పెట్టిన ఇబ్బందులను చెబుతున్నారు. ఒకవేళ పెనుకొండలో తిష్టవేస్తే ఇల్లు కట్టాలన్నా, భూమి కొనాలన్నా, లేఅవుట్ వేయాలన్నా, ఆఖరికి రైతు బోరువేసుకోవాలన్నా ఆమెకు తెలియకుండా చేయడానికి వీలుండదంటూ చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా కళ్యాణదుర్గం దందాలను పెనుకొండకు బదిలీ చేశారంటూ జనం చర్చించుకుంటున్నారు.

ఖాకీలపై ఉత్తుత్తి ప్రేమ

జగన్ పాలనలో పోలీసులకు సకాలంలో అందని రాయితీలు

పేపర్‌కే పరిమితమైన వారాంతపు సెలవులు

హిందూపురం, మే 11

నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే పోలీసుల పట్ల సీఎం జగన్‌ది ఉత్తుత్తి ప్రేమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలీసులకు అది చేస్తాం. ఇది చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసమిచ్చిన వైసీపీ నాయకులు ఏమీ చేయకుండానే ఐదేళ్లు గడిపేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన రాయితీలను సైతం సకాలంలో అందించకుండా మోసం చేశారని మండిపడుతున్నారు. పోలీసులకు అందాల్సిన జీపీఎఫ్, సెరెండర్ సెలవులు, అరియర్స్ సకాలంలో అందక ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం పోలింగ్ సమీపిస్తున్న వేళ పోలీసులను తమవైపు తిప్పుకునేలా గట్టి ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు ఇవ్వని సెరెండర్ సెలవుల సొమ్మును గతవారం బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. దీనిద్వారా పోలీసుల్లో తమపై ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులకు ఉల్లాసం, ఉత్సాహం కరువైంది. గతంలో యోగ, మానసిక ప్రశాంతతకు శిక్షణా తరగతులు నిర్వహించే వారు. ప్రస్తుతం అవన్నీ ఏవీ అమలు కావడం లేదు. ముఖ్యంగా 2019 ఎన్నికల సందర్భంగా పోలీసులకు వారంతపు సెలవులు అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేరలేదు. సెలవులు లేకపోవడంతో పోలీసులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

గాలిలో దీపంలా పోలీసుల ఆరోగ్యం



టీడీపీ పాలనలో పోలీసుల ఆరోగ్య భద్రతపై ప్రధాన దృష్టిపెట్టారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పక్షపాతిగా వ్యవహరించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్‌శాఖ సంక్షేమానికి రూ.15కోట్లు కేటాయించారు. ఏడాదికి రెండుసార్లు ముందస్తుగా మెగా ఆరోగ్య పరీక్షలు చేయించారు. నిపుణులైన వైద్యులతో జిల్లా పోలీస్ కార్యాలయం వద్దే పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు నిర్వహించారు. ముందస్తుగానే వ్యాధి తీవ్రతను గుర్తించి అందుకు అనుగుణంగా వైద్య పరీక్షలు అందించారు. పోలీసులతోపాటు వారి కుటుంబాలకు పరీక్షలు నిర్వహించారు. కానీ వైసీపీ పాలనలో ఇవేవీ అమలు కాలేదు. దీంతో వారి ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది.

విచ్చలవిడిగా వైసీపీ పంపకాలు

వలంటీర్లు, బయటి వ్యక్తులతో పంపిణీ... స్థానిక నాయకుల అసంతృప్తి

బుక్కరాయసముద్రం, మే 11: మండుటెండలో సాగిన ఎన్నికల ప్రచార పర్వానికి తెర పడింది. సోమవారం పోలింగ్ జరగనుండడంతో శింగనమల నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచే ఒక్కో ఓటుకు రూ.1000 నుంచి 1500 వరకు పంపిణీ చేశారు. మందుబాబులకు కావాల్సిన మద్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో అనేక గ్రామాల్లో మందుబాబులు మత్తులో తూగుతున్నారు. యువతకు పది మంది కలిసి పట్టణాల్లో బార్లలో డిన్నర్ చేసుకోవడానికి ఒక గుంపునకు రూ. 20వేల వరకూ ఇస్తున్నారు. క్రికెట్ క్రీడాకారులకు క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు చెందిన ప్రైవేట్ కళాశాల విద్యార్థులచే వలంటీర్లు గుర్తించిన వారికి నగదును పంపిణీ చేస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారితో నగదు పంపిణీ చేయడంతో స్థానిక వైసీపీ నేతల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. పది సంవత్సరాల నుంచి పార్టీలో పనిచేస్తున్నామని, అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏ చిన్నపాటి సాయం కూడా చేయలేదని ఎమ్మెల్యేపై వైసీపీ స్థానిక నాయకులు రగిలిపోతున్నారు. ప్రస్తుతం నగదు పంపిణీలో తమకు కనీస గౌరవం ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఎన్నికల రోజున పోలింగ్ వ్యవహారాలు పట్టించుకోకుండా ప్రశాంతంగా ఇంట్లోనే ఉండాలని స్థానిక నాయకులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

కౌన్సిలర్‌కు రూ. 5 లక్షలు ఇవ్వాల్సిందే..!

హిందూపురం అర్బన్, మే 11: మా ఊరిలో బయటి వ్యక్తుల పెత్తనం ఏమిటని హిందూపురం పట్టణానికి చెందిన వైసీపీ కౌన్సిలర్లు నాయకులతో గొడవకు దిగినట్లు సమాచారం. ఐదు సంవత్సరాలుగా పార్టీకి కష్టపడితే మమ్మల్ని నమ్మకుండా బయటి వ్యక్తులకు పెత్తనం కట్టడమేంటని నిలదీసినట్లు ప్రచారం జరుగుతుంది. అదే విధంగా ఒక్కో కౌన్సిలర్‌కు రూ. 5 లక్షలు ఇస్తేనే పని చేస్తామని వైసీపీ నాయకులకు కొంత మంది కౌన్సిలర్లు ఖరాకండిగా చెప్పినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని నోటుతో ప్రభావితం చేయాలని ప్రతి వార్డులో జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి పట్టణ పరిధిలోని మోడల్ కాలనీలో ఓటుకు రూ. 2 వేలు చొప్పున అందించాలని సూచించారు. కాలనీలో తక్కువ ఇవ్వడంతో స్థానికులు గొడవకు దిగినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన కాలనీ వాసులు మాకు మీ డబ్బు వద్దు ఇక్కడ నుంచి వెళ్లి పోవాలని, లేని పక్షంలో ఫొటోలు, వీడియోలు తీసి, పోలీసులకు, ఎన్నికల అధికారులకు అందచేస్తామని హెచ్చరించినట్లు వైసీపీ నాయకులే చర్చించుకున్నారు. దీంతో డబ్బు పంపకాలు ఆపివేసి మరుసటి రోజు పంచుదామని, కాలనీ వాసులను సముదాయించి అక్కడ నుంచి వెనుతిరిగినట్లు తెలిసింది.

కొండ గుట్టలను కొల్లగొట్టారు..!

అనంతపురం రూరల్, మే 11

అధికార పార్టీ నాయకుల అక్రమ మట్టి రవాణా దెబ్బకు కొండ, గుట్టలు కనుమరుగవుతున్నాయి. ఐదేళ్ల కాలంలో మట్టి మాఫియా యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగించింది. అడ్డు చెప్పే అధికారులు లేకపోవడంతో కోట్ల సొమ్మును జేబుల్లో నింపుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి, చియ్యేడు, క్రిష్ణంరెడ్డిపల్లి, నరసనాయునికుంట, మన్నీలా తదితర ప్రాంతాలను అధికార పార్టీ నాయకులు మట్టి అక్రమ రవాణాకు కేంద్రాలుగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

యథేచ్ఛగా అధికారపార్టీ నాయకుల మట్టి అక్రమ రవాణా

టిప్పర్ మట్టి రూ. రెండు వేలు

అనంతపురం రూరల్ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉండటం మట్టిమాఫియాకు బాగా కలిసి వస్తోంది. నగరంలో వేస్తున్న లే అవుట్లకు, ఇతరత్ర వాటికోసం మట్టిని ట్రిప్పర్లతో తోలి జేబులు నింపుకున్నారు. టిప్పర్ రూ.1500 నుంచి రూ.2వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. దూరాన్ని బట్టి మరింత ధర పెంచి వసూలు చేసుకున్నారు. నరసనాయునికుంట, క్రిష్ణంరెడ్డిపల్లి, ఉప్పరపల్లి తదితర ప్రాంతాల పరిధిలోని కొండ, గుట్టలు మట్టి మాఫియా అరాచకాల కు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి.


క్రిష్ణంరెడ్డిపల్లి సమీపంలో కొండను తవ్విన దృశ్యం


నరసనాయుని కుంట సమీపంలో రుషికొండను తలపిస్తున్న తవ్వకాలు

మధ్యలో అమిగోస్ తవ్వకాలు..

నాయకులు ఒక వైపు మట్టిని అక్రమంగా తవ్వి, రవాణా చేసుకుని సొమ్ము చేసుకుంటుంటే..మధ్యలో అమిగోస్ అనే కంపెనీకి ఎలాంటి అనుమతులు ఉన్నాయోగాని..కొండల్లోని మట్టిని టిప్పర్లకు..టిప్పర్లు తవ్వేస్తున్నారు. నేటికి ఈ కంపెనీ తవ్వకాలు జరుగుతున్నాయి. కంపెనీకి ఎంత వరకు అనుమతులున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి. నరసనాయుని కుంట సమీపంలో కంపెనీ తవ్వకాలతో స్థానికంగా ఉన్న కొండ మరో రుషికొండను తలపిస్తోంది. రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్ల మట్టి కొండల్లోనుంచి తరలివెళ్లిపోతోంది.


మరో వెయ్యి పంపిణీకి సన్నాహాలు

కళ్యాణదుర్గం వైసీపీకి ఓటమి భయం

ఇప్పటికే రూ.2 వేలు పంపిణీ

రంగంలోకి మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు





కళ్యాణదుర్గం, మే 11: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైసీపీకి ఓటమి భయం పట్టిపీడిస్తోంది. ఎలాగైనా గెలవాలని, ప్రలోభాలతో ఓటర్లను మభ్యపెట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రెండు రోజుల క్రితం ఓటుకు రూ. 2 వేలు చొప్పున ప్రతి గ్రామంలోను దాదాపు పంపిణీ పూర్తి చేశారు. మిగిలిన కొంతమందికి కూడా పంపిణీ చేస్తే విజయం మనకే వరిస్తుందన్న ధీమాతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరవర్గం భావిస్తోంది. అదనంగా మరో రూ. వెయ్యి పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రతి గ్రామంలోను ప్రధాన నాయకుడిని, వలంటీర్లను వెంటబెట్టుకుని డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల ముఖ్య నాయకులతో అదనంగా మరో రూ. వెయ్యి ఇస్తే ఎలా వుంటుందని చర్చలు సాగినట్లు తెలిసింది. ఆ లెక్కన ఒక్కో మండలానికి ఎంత నగదు పంపిణీ చేయాల్సి వస్తుందోనని లెక్కలు వేసుకుంటున్నారు. ఆదివారం ఒక్క రోజు మాత్రమే వుండటంతో వైసీపీ అసమ్మతి వాదులను బుజ్జగించి నోట్లతో ఎరవేయడమే ప్రధానంగా ముందడుగు వేస్తున్నారు. దాంతో పాటు టీడీపీ అసమ్మతి వాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఎలాగైనా బేరం చేసి వైసీపీ వైపు తిప్పుకోవాలనే ఆలోచనలో వున్నారు. ఇప్పుడు ఏ గ్రామంలో చూసినా అర్ధరాత్రి 12 దాటినా ఎన్నికల వాతావరణంతో వాహనాల రద్దీ కనిపిస్తోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచర వర్గం బలహీనంగా వున్న మండలం వైపే ప్రధాన దృష్టి సారించారు. ఇప్పటికే వారి వద్ద ఓ జాబితా వుంచుకుని దాని ఆధారంగా ఫోన్లలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు మంతనాలు సాగిస్తున్నారు. ఈ డబ్బు చాలకపోతే అదనంగా మందు బాటిళ్లు ఇచ్చేందుకు కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏదిఏమైనా కళ్యాణదుర్గం వైసీపీ ప్రలోభాల పర్వం జోరందుకున్నాయి.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రామానుజాచార్య (జయంతి)



రామానుజాచార్యులు చెన్నై పట్టణానికి 25 కిలోమీటర్ల దూరంలోని శ్రీపెరంబుదూరులో 1017లో జన్మించారు. తమిళ సంవత్సరం ప్రకారం మే 12న ఆచరించనున్నారు. గొప్ప తత్వవేత్త, ఆస్తిక హేతువాది, యోగి. వేదానికి సరైన అర్థం చెప్పి విశిష్టాద్వైత గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయులు. కర్తవ్యదీక్షలో అనన్య సామాన్యమైన నమ్మకానికి, సాటిలేని భక్తికీ ఆయన జీవితం ఒక ఉదాహరణ. మేలుకోట, శ్రీరంగం, తిరుపతి అనేకచోట్ల దివ్యస్థలాల్లో మఠాలను ఏర్పాటు చేశారు. 1137లో పరమపదించారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ (జయంతి)



'లేడీ విత్ ది ల్యాంప్' గా పేరొందిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820 మే 12న ఇటలీ దేశంలో జన్మించారు. సమాజ సేవకురాలు, నర్సు. రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యము. ఆమె చేసిన సేవల వల్ల మరణించే రోగుల సంఖ్య కూడా బాగా తగ్గింది. యుద్ధంలో దెబ్బతిన్న ప్రతి సైనికుడికి తాను బ్రతుకుతాను అన్న ఆశ చిగురించేది. 1860 జూన్ 24న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఆఫ్ నర్సెస్‌ను స్థాపించారు. ఆమె భారతదేశానికి కూడా ఇతోధిక సేవలందించారు. 90వ యేట 1910 ఆగస్టు 13న కన్నుమూశారు.

అనసూయాదేవి (జయంతి)




రేడియో వ్యాఖ్యాత, 'కళాప్రపూర్ణ' అవసరాల (వింజమూరి) అనసూయాదేవి 1920 మే 12న కాకినాడలో జన్మించారు. ప్రముఖ జానపద కళాకారిణి, దక్షిణభారత తొలి మహిళా సంగీత దర్శకురాలు, రచయిత. హార్మోనియం వాయించటంలో దిట్ట. 8ఏళ్లకే ఆమె పాట రికార్డు అయ్యింది. ఈమె మేనమామ దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన ప్రముఖ దేశభక్తి గీతం 'జయజయ జయ ప్రియ భారత' పాటకు బాణీ కట్టారు. దేశంలో జానపద గేయాలకు సినీ జగత్తులో వన్నె తేవడమే కాక, కర్ణాటక బాణీలో స్వరపరిచిన తొలి స్వరకర్త. విశ్వ విద్యాలయాలలో శాస్త్రీయసంగీతాన్ని పాఠ్యాంశంగా చేర్పించిన అసమాన గాయని. ప్రపంచవ్యాప్తంగా 11 జీవితసాఫల్య పురస్కారాలు పొందారు. 2019 మార్చి 23న కన్నుమూశారు.

షేక్ చిన మౌలానా (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత డాక్టర్ షేక్ చిన మౌలానా 1924 మే 12న ప్రకాశం జిల్లా కరవది గ్రామంలో జన్మించారు. పూర్వీకులు గుంటూరు జిల్లా వాసులు. చిన్న తనంలో షేక్ ఆదమ్ సాహెబ్ వద్ద నాదస్వర వాదనలో శిష్య రికం పొందారు. దురైకణ్ణు పిళ్ళై వద్ద ఆరితేరారు. శ్రీరంగం ఆలయంలో ఆస్థాన విద్వాంసుడిగా వ్యవ హరించారు. సుబ్రమణ్యస్వామి భక్తుడు. ఆంధ్ర విశ్వ విద్యాలయ చాన్స్‌లర్‌గా ఉన్నవేళ అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మచే 1985లో 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కారం అందుకున్నారు. సంగీత కళానిధి తదితర పురస్కారాలు పొందారు. 1999 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

జనార్ధన్ మిట్టా (పుట్టినరోజు)



పండిట్ జనార్దన్ మిట్టా 1934 మే 12న జన్మించారు. చెన్నైకు చెందిన ఆయన సితార్ కళాకారుడిగా పేరొందారు. ఆలిండియా రేడియోలో పనిచేశారు. దేశ విదేశాలలో పర్యటించి సంగీతంపై అవగాహన కల్పించి, మెళకువలు నేర్పించారు. ఐక్య రాజ్యసమితిలోనూ సంగీత కచేరీ ప్రదర్శించారు. చెన్నైలో సినీరంగంలో దశాబ్దాలపాటు సితార్ కళాకారుడిగా సేవలందించారు. చెన్నైలోని అమీర్ ఖుస్రో సంగీత అకాడమీ నుంచి జీవితసాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు పొందారు.

దక్షిణాదిన అవిరా నాలుగో శాఖ

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే వజ్రాల వ్యాపారంలో పేరొందిన సంస్థ అవిరా దక్షిణభారత్‌లో నాల్గోశాఖను తెరిచినట్లు వ్యవస్థాపకుడు సురేష్‌జైన్ ప్రకటించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ల్యాబ్ గ్రోన్ డైమండ్ జ్యూవెలరీ బ్రాండ్‌గా ఉండే అవిరా వినియోగదారుల ఆశయాలకు అనుగుణంగా డిజైన్‌లను రూపొందిస్తుందన్నారు. పాండిచ్చేరిలో శాఖ ద్వారా తమిళనాడులో వ్యాపారాలు విస్తరించదలచామన్నారు. రానున్న 10 నెలలో దక్షిణాదిన 10 శాఖలు తెరిచే ఆలోచన ఉందన్నారు. వజ్రాలలో నమ్మకానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వజ్రం ప్రేమకు సంకేతమని అందుకు అనుగుణంగానే నాణ్యత ముఖ్యమన్నారు. గనుల ద్వారా తయారయ్యే వజ్రాల కంటే ల్యాబ్‌లలో తయారయ్యే డైమండ్‌లు 70శాతం తక్కువ ధరలకే లభిస్తాయన్నారు. కంపెనీ విక్రయించే వజ్రాలు వందశాతం జీవితకాలం ఉంటాయని 95శాతం వాపసు చేసినా సొమ్ము సాధ్యం కానుందన్నారు. నాణ్యత విషయంలో రాజీకి అవకాశం లేకుండా తయారీ చేస్తున్నామన్నారు.

చౌడసంద్రలో ఆంజనేయస్వామికి విశేషపూజలు



తమలపాకుల అలంకరణలో స్వామివారు

శిడ్లఘట్ట, మే 11: తాలూకాలోని చౌడసంద్ర గ్రామంలో కొలువైన వ్యాస మహర్షి కాలంనాటి పురాతన ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు సీవీ శ్యామ్ సుందర్ నేతృత్వంలో స్వామి వారికి అభిషేకం అనంతరం తమలపాకులతోనూ, పూలతోనూ అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మాతృత్వం మహత్తరమైనది

» పలు చోట్ల అర్థవంతంగా మాతృదినోత్సవం

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి జీవితంలో ఎన్నో మార్పులు అనుభవాలు ఉండొచ్చు. కానీ నిరంతరం అభిమానించి వారి ఎదుగుదలను ఆకాంక్షించేవారు మాతృమూర్తులు. ప్రతిరోజుకు ఓ ప్రత్యేకత ఉంటుంది. వాటిలో ఎన్నింటినో జనం మరిచిపోతుంటారు. కానీ మాతృత్వదినాన్ని జరుపుకొనే సంప్రదాయం రోజురోజుకు పెరుగుతోంది. ఇదో మహత్తరమైన మార్పుగా కూడా భావించవొచ్చు. తల్లులపట్ల అభిమానం పెరిగితే వృద్యాప్యంలో వారి జీవనం సుఖమయంగా ఉంటుంది. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సంస్థలు శనివారం విశేష కార్యక్రమాలు జరిపాయి. మణిపాల్ ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గైనకాలజిస్ట్‌లు, చర్మవ్యాధి నిపుణులతోపాటు అన్ని విభాగాల మహిళా నిపుణులు పాల్గొన్నారు. మణిపాల్ ఆసుపత్రిలో చికిత్సలు పొందిన మహిళలతోపాటు నగరానికి చెందిన వివిధ విభాగాల ముఖ్యులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా శతాబ్దంలో యువ తల్లులు ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. వైద్యనిపుణులు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ప్రసవానంతరం ఒత్తిడికి గురవుతున్నారని, వారికి మానసిక ఆరోగ్యంలోనూ వ్యత్యాసం వస్తోందన్నారు. గర్భిణీలు ఉద్యోగాలలో బిజీతోనూ ఒత్తిళ్లకు గురవుతున్న అంశంపైనా చర్చ సాగింది.

ఉద్యోగంతోపాటు కుటుంబాన్ని బ్యాలెన్స్ చేస్తున్నాం : పల్లవి



పల్లవి హెచ్‌సీ

మహిళలు భిన్నమైన రంగాలలో ఉద్యోగ, వ్యాపారాలలో జీవనం సాగిస్తున్నా ఉత్పాదనా రంగంలో 12శాతం మంది మాత్రమే ఉన్నారు. గృహోపకరణాల బ్రాండ్ పిజన్ ఉత్ప త్తులు స్టవ్ క్రాఫ్ట్‌లో 80శాతం మంది మహిళలే ఉద్యోగాలు చేస్తున్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉద్యోగంతోపాటు కుటుంబాన్ని బ్యాలెన్స్ చేస్తున్నామని 26ఏళ్ల పల్లవి హెచ్‌సీ అభిప్రాయపడ్డారు. ఏడేళ్లుగా స్టోవ్‌క్రాఫ్ట్‌లో పనిచేస్తున్నానన్నారు. ఇద్దరు పిల్లల చదువు, కుటుంబం నాపై ఆధారపడిందన్నారు. కొవిడ్ వేళ భర్తను కోల్పోయా నన్నారు. కొవిడ్ కారణంగా భర్తను కోల్పోయానని ఇదే సమయంలోనే కొడుకు పుట్టాడన్నారు. గర్భిణిగా, బాలింతగా ఉన్నప్పుడు సెలవు అవకాశం ఇచ్చార న్నారు. ఈఎస్ఐ ద్వారా ఆర్థిక సాయం లభించిం దన్నారు.

వందరూపాయలకు రోజంతా పనిచేశా : మంగళ

ఉద్యోగ అవకాశాలు సులభంగా లభించవని స్టోవ్‌క్రాఫ్ట్‌లో చేరముందు వంద రూపాయలకు రోజంతా పనిచేశానని



మంగళ

మంగళ తెలిపారు. 13ఏళ్లక్రితం ఇక్కడ చేరానన్నారు. ఆర్థికంగాను ఊరట లభించిందని, కుటుంబ పోషణకు అనుకూలమైందన్నారు. మహిళలు గౌరవంగా జీవనం సాగించేందుకు స్వావలంబన కీలకమన్నారు.

ఇక్కడ తల్లులకు ప్రాధాన్యం : దీప

ఇక్కడ 8ఏళ్లుగా మిక్సర్ విభాగంలో పనిచేస్తున్నా అని దీప పేర్కొన్నారు. జీవితంలో పలు సమస్యలు ఎదుర్కొన్నా అన్నారు. తల్లులకు ఇక్కడ ప్రాధాన్యత ఇస్తారని, ప్రత్యేకమైన సౌలభ్యాలు కల్పిస్తారన్నారు. ఇక్కడ పనిచేయడం ప్రారంభించాకనే నా జీవితంలో మార్పులు, నా కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు కారణమైందన్నారు. త్వరలోనే నా కలల ఆశయమైన ఇంటిని నిర్మించుకుంటున్నా అన్నారు.



మణిపాల్ ఆసుపత్రిలో తల్లుల దినోత్సవం

కష్టాలతో నా జీవనం ప్రారంభం

కష్టాలతో నా జీవనం ఆరంభమైందని 36ఏళ్ల పార్వతి పేర్కొన్నారు. భర్త ఆటో డ్రైవర్‌గా సంపాదించే సొమ్ముతోనే కుటుంబం ఆధారపడి ఉందన్నారు. అత్యవసరాలకోసం చేసిన అప్పులు తీర్చలేక పోరాటమే చేశానన్నారు. కిరోసిన్ స్టవ్ విభాగంలో హెల్పర్‌గా చేరి ప్రస్తుతం కుక్‌టాప్ విభాగంలో పనిచేస్తున్నా అన్నారు. ఇబ్బందికరం లేని ఉద్యోగం ద్వారా కుటుంబానికి అండగా నిలిచానని 18, 16 ఏళ్ల కుమార్తెల భవిష్యత్తుకు నా ఉద్యోగం సోపానమైందన్నారు. ఇలా పలువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

వైభవంగా వీరాంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తుల సందడి

చింతామణి రూరల్, మే 11: చింతామణి తాలూకాలోని మురగమల్లా హోబళి పెద్దూరు గ్రామంలో కొలువైన వీరాంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవంలో స్వామివారి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయంలో మహాగణపతి, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి దేవతామూర్తులు ఉన్నారు. వీరాంజనేయస్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేషపూజలు కొనసాగాయి. పలు హోమాలు నిర్వహించిన అనంతరం అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకెళ్లి కొలువుదీర్చారు. గోవిందనామస్మరణ నడుమ రథోత్సవం సాగింది. భక్తులు రథంపై అరటిపండ్లు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవంలో నాదస్వరం, డప్పు కళాబృందాలతోపాటు చెక్కభజన బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పలు గ్రామాలకు చెందినవారు పెసరపప్పు, పానకం పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. మరోవైపు అఖండ రామకోటి భజన భక్తిశ్రద్ధలతో సాగింది. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తాలూకా బట్లహళ్ళి స్టేషన్ పోలీసులు బందోబస్తు కల్పించారు. బ్రహ్మరథోత్సవంలో వీరాంజనేయస్వామి సేవా ట్రస్టు గౌరవాధ్యక్షులు, న్యాయవాది ఎస్ రఘునాథగౌడ, శ్యామలమ్మ, ప్రధాన కార్యదర్శి వీ రమేశ్, ధర్మకర్త సీవీ శ్రీనివాస్‌గౌడ, ఈశ్వర్‌గౌడ, పాపిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వినయ్‌గౌడ, వేణుగోపాల్‌గౌడ, ముఖ్య అతిథులుగా రాజరాజేశ్వరి, లోహితేశ్వరి, మారుతిరెడ్డి, దేవస్థాన సంస్థాపకులు వెంకటప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం

పెద్దూరు గ్రామంలో బ్రహ్మరథోత్సవంలో భాగంగా ఈనెల 12న ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు గ్రామస్థులచే దీపోత్సవం, వసంతోత్సవం, రాత్రి వాద్య గోష్ఠి, బుర్రకథ, కోలాటం జరగనుంది. 14న ఉదయం పలు పూజలు నిర్వహించనున్నారు.



రామభజనలో భక్తులు

మాజీ ప్రధాని దేవెగౌడకు స్వామీజీల పరామర్శ



దేవేగౌడను పరామర్శిస్తున్న స్వామిజీలు

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవేగౌడను పలువురు స్వామిజీలు కలిశారు. కుమారుడు రేవణ్ణ జైలు పాలు కావడం, లైంగిక దౌర్జన్యాల వివాదంలో మనవడు ప్రజ్వల్ విదేశాల్లో తలదాచుకున్నారు. 90 ఏళ్లు పైబడిన దేవేగౌడ ఇటీవల కొన్ని రోజులుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పి ఆశీస్సులు అందించేందుకు పలువురు స్వామిజీలు శనివారం పద్మనాభనగర్‌లోని దేవేగౌడ నివాసానికి వచ్చారు. చలవాది గురుపీఠ బసవనాగిదే స్వామిజీ, బంజారపీఠం సర్దార్ సేవాలాల్ స్వామిజీ, కలబురగి పుణ్యకోటి ఆశ్రమ వరలింగస్వామిజీతోపాటు పలువురు మాజీ ప్రధాని దేవేగౌడను కలిశారు. సుమారు అరగంటకుపైగా దేవేగౌడతో చర్చలు జరిపారు.

సరిహద్దులో క్రూజర్ బోల్తా ముగ్గురు మహిళల దుర్మరణం

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా అథణి ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు మహారాష్ట్రలో జరిగిన క్రూజర్ బోల్తా ప్రమాదంలో దుర్మరణం చెందారు. శనివారం ఉదయం ముగ్గురు మహిళలు సరిహద్దులోని మహారాష్ట్రలో పనుల కోసం బయల్దేరారు. జత్తా ప్రాంతంలో క్రూజర్ టైరు పేలి బోల్తా పడింది. ప్రమాదంలో మహదేవి చౌదాల, గీతా దూడమనె, కస్తూరిలు మృతి చెందారు. క్రూజర్‌లో ప్రయాణిస్తున్న పలువురు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

నగదు కోసం కిడ్నాప్ .. కలబురగిలో దారుణం

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నగదుకోసం సెకండ్‌హ్యాండ్ కార్ల వ్యాపారి, అత డి స్నేహితులను కిడ్నాప్ చేసి ఓ గదిలో బంధించి తీవ్రంగా హింసించిన సంఘటన కలబురగి జిల్లాలో చోటు చేసుకుంది. ముగ్గురిని గదిలో బంధించి బట్టలు తీసి మర్మాంగాలకు కరెంటు షాక్ ఇచ్చి నగదును దోచిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కలబురగి జిల్లా సేడం తాలూకా దేవనూరు గ్రామానికి చెందిన అర్జున్ బెంగళూరు నుంచి కార్లు తీసుకొచ్చి విక్రయించేవారు. ఈనెల 5న రమేశ్ అనే వ్యక్తి కోసం సెకండ్‌హ్యాండ్‌కారును చూపేందుకు అర్జున్, ఇద్దరు స్నేహితులు ఎండీ సమీరుద్దీన్, అబ్దుల్ రెహమాన్‌లతో కలసి వెళ్లారు. రమేశ్ కారు టెస్ట్ డ్రైవ్ చేశాక నగదును హగరగ క్రాస్ వద్ద ఇస్తామని చెప్పాడు. దీంతో అర్జున్‌తో కలిపి ముగ్గురు అక్కడికి వెళ్లారు. ఆ తర్వాత ఓ ఇంట్లో బంధించి సుమారు పదిమంది దాడి చేశారు. రమేశ్‌తోపాటు ఇమ్రాన్ పటేల్, మహ్మద్ మతీన్‌లు దాడి చేశారు. ముగ్గురికి మర్మాంగాలకు కరెంటు షాక్ ఇచ్చి హింసించారు. దాడి చేసిన దృశ్యాలను వీడియోలో రికార్డు చేశారు. కారు కొనుగోలు కమీషన్‌గా తీసుకున్న లక్ష రూపాయలు ఇవ్వకుంటే ఇంట్లో దూరి కొడతామని బెదరించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకుని రమేశ్‌తోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

యువకుడి దారుణహత్య



హేమంత్‌గౌడ (ఫైల్)

దొడ్డబళ్ళాపుర, మే 11: మాట్లాడాలంటూ పిలిచిన ఒక మిత్రుడి గ్యాంగ్ లాంగ్, మచ్చుతో దాడి చేశారు. రక్తస్రావంతో యాతన అనుభవిస్తున్న వ్యక్తిని టెంపోలో ఊరంతా తిప్పి చచ్చాక మృతదేహాన్ని రోడ్డుపై పడేశారు. వివరాలిలా. దొడ్డబళ్ళాపుర శివారులోని బాశెట్టిహళ్ళి సమీపంలోని జేపీ బార్ వద్ద శుక్రవారం రాత్రి 11 గంటలకు గ్యాంగ్ యువకుడిపై లాంగ్‌తో దాడి చేసింది. సమాచారం అందుకున్న మిత్రులు విషయాన్ని హేమంత్‌గౌడ (27) కుటుంబీకులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకోగా అక్కడ రక్తపు మరకలు కనిపించాయి. దీంతో రాత్రంతా వెదుకులాట చేశారు. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు హేమంత్‌గౌడ మృతదేహం లభ్యమైంది. హేమంత్ గౌడ రియల్ ఎస్టేట్‌తోపాటు సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహించేవాడు. స్నేహితులైన నరసింహమూర్తి అలియాస్ సంతు అలియాస్ మిట్టి దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి నరసింహమూర్తి ఫోన్ చేసి హేమంత్‌గౌడను బార్ వద్దకు రప్పించారు. బార్ బయట సుమారు 15మంది గ్యాంగ్ దాడికి పాల్పడ్డారు. అక్కడనుంచి పారిపోయి వాహనంలో తిప్పి ఒక చోట పడేశారు. ఈలోపు హేమంత్‌గౌడ కుటుంబీకులు ఎంతగా తిరిగినా ప్రయోజనం లేకపోయింది. తెల్లవారుజామున నవోదయ పాఠశాల వద్ద మృతదేహాన్ని గుర్తించారు. ఆరోపితుడు నరసింహమూర్తిపై బెంగళూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే రౌడీషీటర్ నమోదైంది. పోలీసులు వెల్లడించిన సమాచారం మేరకు నరసింహమూర్తి, హేమంత్‌గౌడలు మిత్రులని అయితే ఏదో ఒక అంశంలో ఇద్దరిమధ్య మనస్పర్థలు ఏకంగా హత్యకు దారి తీశాయని తెలుస్తోంది. ప్రస్తుతం పరారీలో ఉన్న నరసింహమూర్తికోసం గాలింపులు చేపట్టారు. హేమంత్‌గౌడ తండ్రి శశికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది.

మార్కెట్‌లోకి పుచ్చకాయలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

శిడ్లఘట్ట, మే 11: ఎండాకాలం వచ్చిందంటే చాలు పలు రకాల సీజనల్ పండ్లు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుత ఎండల వేడిమి నుంచి దాహర్తి తీర్చే వాటిలో పుచ్చకాయలు ఒకటి. అలాగే దోసకాయలు, కీరదోస, తాటి ముంజలు, మామిడి వంటివి ఉన్నాయి. సాధారణంగా 26-30 ఉష్ణోగ్రతలు ఉండేవి. రెండుమూడువారాలుగా సాధారణంకంటే అధికంగా 35-40 మధ్యన నమోదవుతోంది. దీంతో మధ్యాహ్నం వేళ సంచారం తగ్గింది. ఎండదెబ్బ తగల కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఇప్పటికే ప్రకటించింది. మధ్యాహ్నం వేళ బయటకు వస్తే నీరు, మజ్జిగతోపాటు దాహర్తి తీరేలా కొబ్బరిబోండా తాగడం లేదా పుచ్చకాయలు తీసుకోవడం సామాన్యంగా ఉంది. ప్రస్తుతం ఎండకాలంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సీజన్‌కు అనుగుణంగా కాయలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న ఉక్కపోత

శిడ్లఘట్ట పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎండవేడిమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి కరెంటు కోతతో కనీసం ఫ్యాన్‌లు కూడా పనిచేయవు. కొన్నిరోజులుగా ఉక్కపోత భరించలేనంతగా ఉంది. దీంతో వరుణదేవుడు ఎప్పుడు కరుణిస్తాడా... అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండవేడిమితో సాయంత్రం అయినా సేద తీరుదామంటే సాధ్యం కాని పరిస్థితి. మరోవైపు రాత్రివేళల్లో దోమల బెడదతో నిద్రపట్టడం లేదని పలువురు వాపోతున్నారు. ఎండ వేడిమితో దగ్గర ప్రాంతాలకు సంచరించాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోందని అంటున్నారు. ఏదేమైనా ప్రకృతి కరుణించి వర్షం కురిస్తే తప్ప తాపం తగ్గదని పలువురు అభిప్రాయపడ్డారు.

ఎస్ఎస్ఎల్‌సీలో మ్యాక్స్‌ముల్లర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



మనీష్ తాండేల్, శమిత ఎస్.కె., యుక్త ఎం.పి., హేమశ్రీ ఎం., పృథ్వి శ్రీ

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో నగరంలోని బసవేశ్వరనగర్ మ్యాక్స్‌ముల్లర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాణించారు. పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ హేమలత శనివారం మీడియాతో మాట్లాడుతూ 143 మంది పరీక్షలు రాయగా 88.81శాతం ఉత్తీర్ణత సాధ్యమైందన్నారు. 90శాతానికిపైగా ఉత్తీర్ణత సాధించినవారు 12మంది ఉండగా 85శాతంపైగా ఉత్తీర్ణతతో 29మంది ఉండగా 80శాతం ఉత్తీర్ణతతో 45మంది పాస్ అయ్యారన్నారు. మనీష్ తాండేల్ 98.4శాతం, శశ్మిత ఎస్.కె. 95.36శాతం, యుక్త ఎం.పి. 95.36శాతం, హేమశ్రీ ఎం 94.72 శాతం, పృథ్వి శ్రీ 94.72 శాతం సాధించారన్నారు. పునీత్ 92.96శాతం, యోగితా 92.64, విస్మయ 92.48, ధన్యశ్రీ 92.16, రిధి ఎం జైన్ 92.16, శివస్వరూప్ 92శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రతిభావంత విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

అంతరిక్షంపై అవగాహనకు గో కాస్మో



వర్చువల్ వొయేజర్‌లో వీక్షణ

బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో అంతరిక్షంపై అవగాహన కల్పించేందుకు ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'గో కాస్మో' యువర్ టికెట్ టు స్పేస్ పేరిట నక్షత్రమేళాను ఆరంభించారు. మేళాలో ఏలియెన్ ఎన్‌కౌంటర్, ప్లానెటరీ పాండర్, గ్రావిటేషనల్ జిమ్, కామిట్ క్రాఫ్టింగ్, కాస్మిక్ కొలైడర్, వర్చువల్ వయేజర్, స్పిన్నింగ్ స్పేస్‌షిప్ వర్క్‌షాప్‌లాంటి నమూనాలు ఏర్పాటు చేశారు. ఖగోళ శాస్త్రం, విశ్వవిజ్ఞానం, భౌతికశాస్త్రం పట్ల చిన్నారులలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. మూడు రోజుల పాటు కార్యక్రమం కొనసాగనుందని ఆర్కిడ్స్ స్కూల్ అకడమిక్ వైస్‌ప్రెసిడెంట్ అజిత్‌సింగ్ తెలిపారు.

రెండు తెలుగు పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత



వివేకనగర్ పాఠశాల విద్యార్థులు ప్రవీణ్, భరత్, అంజలి



శివాజీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


బెంగళూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని రెండు తెలుగు పాఠశాలల్లో ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. వివేకనగర్‌లోని సేవాభారత్ ట్రస్టు పర్యవేక్షణలోని హైస్కూల్‌లో 500 మార్కులతో ప్రవీణ్ ప్రథమ ర్యాంకు లోనూ, 475 మార్కులతో భరత్ ద్వితీయ స్థానంలోనూ, 430 మార్కులతో అంజలి తృతీయస్థానంలో నిలిచారు. 14మంది పరీక్షలు రాయగా ఫస్ట్‌క్లాస్‌లో ఆరుగురు, సెకండ్‌క్లాస్‌లో నలుగురు, థర్డ్‌క్లాస్‌లో నలుగురు ఉత్తీర్ణులయ్యారు. శివాజీనగర్ ప్రభుత్వ తెలుగు పాఠశాలలో నరేంద్రబాల 84శాతంతో ప్రథమస్థానంలోనూ శారద 75.2శాతం, హరిప్రశాంత కుమార్ రాజు 70.08శాతం మార్కులు సాధించారు. 18మంది పరీక్షలు రాయగా 10మంది ఫస్ట్‌క్లాస్, ఐదుగురు సెకండక్లాస్, ముగ్గురు థర్డ్‌క్లాస్‌లో పాస్ అయ్యారు. సేవాభారత్ ట్రస్టు అధ్యక్షుడు బండి ఆదినారాయణరెడ్డి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుల సేవలను ఆయన కొనియాడారు.

ఐఎఫ్ఎస్ టాపర్‌కు ఆత్మీయ సన్మానం



చక్రధర్‌ను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

చింతామణి, మే 11: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2023లో నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) మెయిన్స్‌లో చింతామణి తాలూకా అనకల్ శెట్టిహళ్ళి గ్రామానికి చెందిన చక్రధర్ ఎస్ ఆలిండియా స్థాయిలో 117వ ర్యాంకు సాధించారు. పట్టణంలోని ఆశ్రయ లే అవుట్‌లోని వెంకటాద్రి పీయూ కళాశాలలో ఆత్మీయంగా సత్కరించారు. అనకల్ శెట్టిహళ్ళి గ్రామానికి చెందిన రైతు బీ శ్రీనివాసరెడ్డి, బయమ్మ దంపతుల కుమారుడు చక్రధర్ యూపీఎస్‌సీ పరీక్షల్లో జాతీయస్థాయిలో టాపర్‌గా నిలిచి రాష్ట్రానికి, జిల్లా, తాలూకాకు కీర్తి తెచ్చారు. ప్రస్తుతం ఆయన జలవనరులశాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఐదేళ్లుగా సేవలందిస్తున్నారు. చింతామణి పట్టణంలోని ఎస్ఆర్ఈటీ స్కూల్‌లో ప్రాథమిక విద్య, కెంపేగౌడ హైస్కూల్‌లోనూ, వెంకటాద్రి పీయూ కళాశాలలో పీయూ చదివారు. బెంగళూరులోని ఎంఎస్ రామయ్య కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. చక్రధర్‌ను పీయూ కళాశాలలో తాను చదివిన వెంకటాద్రి కళాశాలలోనే పాలకమండలి అధ్యక్షులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు జాకీర్, సురేశ్, సునీల్, అరుణమ్మ, ప్రభావతి, మంజుళా తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.65	1,576.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1291
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12	115
సామర్థ్యం (టీఎంసీలు)	3.43	3.03

ఘనంగా జోళదరాశి దొడ్డనగౌడ వర్ధంతి



జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చన్నప్ప

బళ్లారి సిటీ, మే 11: నగరంలోని రాఘవ కళామందిరంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంకాలం జోళదరాశి దొడ్డనగౌడ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ గౌరవాధ్యక్షులు చెన్నప్ప తదితరులు దొడ్డన గౌడ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విశ్రాంత అధ్యాపకులు బసవరాజ్ మాట్లాడుతూ జోళదరాశి దొడ్డనగౌడ నాటక, సాహిత్య, కళలకు చేసిన ఎనలేని సేవను స్మరించుకున్నారు. ఆయన తల్లిరుద్రమ్మ, తండ్రి పంపనగౌడ దంపతులకు 1910 జూలై 27న జన్మించారన్నారు. కన్నడ, తెలుగు బాషలలో నాటకాలలో నటించిన ఆయన 40పుస్తకాలు రచించారని, గమక కళకు ఆయన చేసిన కృషి అపారమన్నారు.. బళ్లారి రాఘవ శిష్యుడిగా నాటకరంగానికి ఎనలేని సేవ చేసిన ఆయన మే 10, 1994న ఈలోకాన్ని విడిచివెళ్లారన్నారు. తెలుగులో 'పోయివస్తానండి మా ఇంటికి' అనే పాట రాసి తన ఊరికివెళ్ళి తుది ఊపిరి విడిచారన్నారు. కర్ణాటక రాజ్యోత్సవఅవార్డు, నాటక అకాడమీ అవార్డులను అందుకున్న దొడ్డనగౌడ గుల్బర్గా విశ్వవిద్యాలయం, ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టాలను పొందారు. గౌడ కుటుంబానికి చెందిన పొంపన గౌడ మాట్లాడుతూ దొడ్డనగౌడ సాధించిన విజయాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షులు కే.చన్నప్ప, ఉపాధ్యక్షులు రమేశ్‌గౌడ పాటిల్, గౌరవ కార్యదర్శి ప్రకాశ్, రామంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, చౌదరి, రమణప్ప భజంత్రి, గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో వీధి లైట్ల మరమ్మతు



27వ వార్డులో వీధి లైట్ల మరమ్మతులు చేస్తున్న లైన్‌మన్


సిరుగుప్ప, మే 11 : ఎట్టకేలకు నగరసభ ఆధ్వర్యంలో వీధి లైట్లు మరమ్మతులు చేపట్టారు. సిరుగుప్పపట్టణం 27వ వార్డుకు సంబంధించి నగరసభ వీధి లైట్లు చాలా రోజుల నుంచి వెలుగకపోవడంతో ప్రజలు పెద్దఎత్తున ఫిర్యాదు చేశారు. దీంతో లైన్‌మెన్లు వీధి లైట్ల మరమ్మత్తులను చేపట్టారు.

పీడబ్ల్యూడీ అధికారులు విధులకు గైర్హాజరు



ఖాళీగా దర్శనమిస్తున్న పీడబ్ల్యూడీ కార్యాలయం

సిరుగుప్ప, మే 11 : పీడబ్ల్యూడీ కార్యాలయంలో ఇంజనీర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిరుగుప్ప పట్టణం బస్టాండు ఎదురుగా పీడబ్ల్యూడీ కార్యాలయంలో ఏఈఈతో పాటు ఐదుగురు ఇంజనీయర్లు విధులు నిర్వహిస్తున్నా, క్లర్క్ ఒక్కరు మాత్రమే ప్రతి రోజూ విధులకు హాజరవుతారని, మిగిలిన వారు మాత్రం ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియదని ప్రజలు అంటున్నారు. స్థానికులు సమస్యల నిమిత్తం అధికారులను సంప్రదించేందుకు వస్తే వారు బయటకు వెళ్లారని సమాధానం వస్తోందని ప్రజలు చెబుతున్నారు. కార్యాలయంలో మాత్రం సిబ్బంది వుండటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా పీడబ్ల్యూడీ డీఈ విచారించి చర్యలు తీసుకోవాలని సిరుగుప్ప తాలుకా ప్రజలు కోరుతున్నారు.



బస్సు టిక్కెట్ చార్జీలకు రెక్కలు

- భారీగా ధర పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్
- బెంగళూరుకు రూ. 750 నుంచి రూ.2వేల వరకు వసూలు
- ఎన్నికలకు వచ్చి తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న జనం

బళ్లారి సిటీ, మే 11: బళ్లారి నుంచి బెంగళూరు సహా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు రవాణా సేవలందించే ప్రైవేట్ బస్సులు, ట్రావెల్స్ టికెట్ల ధర భారీగా పెంచారు. ధరలను మూడు నుంచి నాలుగు రెట్లు పెంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గానికి మే 7న పోలింగ్ జరిగింది. ఓటింగ్‌లో పాల్గొనేందుకు బెంగళూరుతోపాటు పలు జిల్లాల నుంచి వేలాది మంది బళ్లారికి వచ్చారు. వీరంతా ఓటు వేసిన అనంతరం తిరిగి తమ తమ పట్టణాలు, పని ప్రాంతాలకు తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకున్న ట్రావెల్స్‌వారు టిక్కెట్ ధరలను భారీగా పెంచేశారు. బెంగళూరుకు ప్రైవేట్ బస్సుల ధర సాధారణ రోజుల్లో రూ. 450నుండి గరిష్ఠంగా రూ. 750 వరకు ఉంటుంది. ప్రస్తుతం మూడు రోజులుగా టిక్కెట్ ధరను కనీసం రూ.900నుండి రూ.2000 వరకు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ట్రావెల్స్‌ను ప్రశ్నిస్తే 'ఎన్నికల కారణంగా ధర పెంచాం. ప్రయాణికులు అధిక సంఖ్యలో వస్తున్నారు. స్లీపర్ సీట్లకు డిమాండ్ పెరిగింది. ఇతర ట్రావెల్స్‌వారు కూడా టికెట్ ధరను పెంచారు.' అనే సమాధానం వస్తోంది. రాత్రిపూట ప్రైవేట్ బస్సుల్లో సీట్లు మూడు, నాలుగు రోజుల ముందే బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రవాణా అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.

ఆంధ్రకు పోదాం! ఓటేసివద్దాం!

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏపీకి కర్ణాటక నుంచి బారులు తీరిన ఓటర్లు

బళ్లారి, రూరల్, మే11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర నుంచి కర్ణాటకకు వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు ఓటు వేసేందుకు వారి వారి స్వస్థలాలకు బయలుదేరారు. ఈ నెల 13న పోలింగ్ ఉన్నందున హుబ్లి, ధార్వాడ, హావేరి, గదగ్, కొప్పాళ, రాయచూరు, గదగ్ తదితర ప్రాంతాలలోని తెలుగువారంతా ఒక్కసారిగా స్వగ్రామాలకు పయనమయ్యారు. దీంతో బళ్లారి రైల్వేస్టేషన్, బస్టాండులు రద్దీగా మారాయి.



బళ్లారి రైల్వే స్టేషన్‌లో రైళ్ల కోసం జనం పాట్లు

ఆంధ్రప్రదేశ్ నుండి పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన కూలీలు కూడా వారి ఊర్లకు తిరిగి ప్రయాణమయ్యారు. సోమవారం ఓటింగ్ జరుగుతున్న వేళ ఊరికి పోయి ఓటేద్దాం అంటూ అందరూ కదలి ఏపీకి బయలుదేరారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో కూలీలకు పనులు లేక నిరుద్యోగులకు ఉపాధి దొరక్క, ఎంతో మంది ఇతర ప్రాంతాలకు వలస వచ్చారు. బెంగళూరు, హుబ్బళి, కలబుర్గి, కర్ణాటక లాంటి ప్రాంతాలకు కూలీలు పొట్టచేత పట్టుకుని వచ్చారు. అలాగే రైతులు, నిరుద్యోగులు కూడా ఊరు వదిలి బతుకు జీవుడా అంటూ కర్ణాటకకు వచ్చారు. ఈ నెల 13న అంటే సోమవారం ఏపీలో ఓటింగ్ జరుగనుంది. వివిధ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు ఆదివారం సెలవు కలిసిరావడంతో వారందరూ ఏపీకి బయలు దేరారు. దీంతో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ఏపీకి వెళ్లే ప్రయాణికులతో కిటకిట లాడుతున్నాయి.



సొంత ఊర్లకు వెళుతున్న జనంతో కిటకిటలాడుతున్న బస్సులు

ఆంధ్రప్రదేశ్ జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బాగా నష్టపోయింది. అక్కడ పనులు లేవు. భవననిర్మాణ కార్మికులకు ఇసుక దొరకదు, అలాగే బిల్లులు రావు.. ఇలా అనేక సమస్యలతో పనులు ఆపేశారు. ఇక బతుకు కష్టం కావడంతో అక్కడ నుంచి ప్రజలు రెండేళ్ల కిందట బెంగళూరు, బళ్లారి, హుబ్బళి ప్రాంతాల్లో కూలీ పనుల కోసం వలస వచ్చారు.

ప్రస్తుతం ఏపీలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు జరుగుతున్నాయి. తాము అక్కడ సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబునాయుడును గెలిపించి తిరిగి వస్తామంటున్నారు బళ్లారిలో పనులుచేసుకుంటున్నవారు. అక్కడ టీడీపీ కూటమి ప్రభుత్వం వస్తే ఉపాధి అవకాశాలు బాగుంటాయని, అలాగే రాష్ట్రం బాగుంటుందని, ప్రజలు బాగుంటారని అంటున్నారు. అందుకే ప్రవాసాంధ్రులు, వలస కూలీలు, నిరుద్యోగులు ఇలా అన్నివర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసేందుకు నిర్ణయించుకుని వెళుతున్నామని తెలిపారు. గతంలో వలస కూలీల ఓట్ల కోసం నాయకులు రానుపోను రవాణాచార్జీలు ఇచ్చి తీసుకుపోయేవారు. ఈసారి తాము స్వచ్ఛందంగా సొంతంగా అక్కడ జగన్‌రెడ్డిని ఓడించడం సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించడం కర్తవ్యంగా భావించి కదులుతున్నామని తెలిపారు. మొత్తం మీద ఈ సారి వలస ఓటర్లు ఏపీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు భారీగా స్వచ్ఛందంగా సొంత ఊర్లకు వెళుతుండడం ఓ ప్రత్యేకత. అక్కడ జగన్ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహం కారణంగా కసిగా కదిలి జగన్ ను ఓడించాలని వెళుతున్నట్టు ప్రతిఒక్కరు తెలిపారు.

జిందాల్ ఘటనలో జేఎస్‌డబ్ల్యు అధికారులపై కేసు నమోదు

- అధికారుల పేరులేకుండా ఎఫ్ఐఆర్
- కేసును తప్పుదోవ పట్టించే రీతిలో పోలీసులపై ఒత్తిడి



సిబ్బంది మృతికి కారణమైన బావులు (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, మే 11: తోరణగల్లు వద్ద ఉన్న జిందాల్ ఉక్కు కర్మాగారంలో గురువారం రాత్రి జరిగిన ఘటనలో ముగ్గురు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనలో మృతి చెందిన భువనహళ్ళి గంటె జడియప్ప సోదరుడు మహేంద్ర తోరణగల్లు పోలీసు స్టేషన్‌లో జిందాల్ సంస్థ నిర్లక్ష్యం కారణంగానే సోదరుడు మృతి చెందాడని ఫిర్యాదు చేయడంలో పోలీసులు జిందాల్ సంస్థకు చెందిన ఆరుగురు అధికారులపై కేసు నమోదు చేశారు. జిందాల్ స్టీల్ లిమిటెడ్ (జెఎస్‌డబ్ల్యూ) సిబ్బంది గురువారం నీటి ట్యాంకులో పడి ముగ్గురు మృతి చెందిన ఘటనకు సంబంధించి ఫ్యాక్టరీ హెచ్‌ఎస్ఎం-03 విభాగం ఇన్‌చార్జ్ ఉపాధ్యక్షులతో పాటు ఆరుగురు అధికారులపై క్రైమ్ నెం 81/2024, ఐపిసి 1860 సెక్షన్ 304(ఎ)గా కేసు నమోదు అయింది. అయితే ఎఫ్ఐఆర్‌లో అధికారులు పేర్లు మాత్రం పొందుపరచలేదు. మృతుడు జడియప్పకు ఒక సంవత్సరం క్రితం కంప్లీ వాసి రమేశప్ప కుమార్తె సంధ్యాతో వివాహమైంది. సంధ్యా ప్రస్తుతం గర్భిణీగా ఉన్న అంశాన్ని ఎఫ్ఐఆర్‌లో నమోదుచేశారు. జడియప్ప గత ఐదు సంవత్సరాల నుండి జిందాల్ ఫ్యాక్టరీలో పనిస్తున్నట్లు పేర్కొన్నారు.

అజిత్ హనుమక్కనవర్‌పై ఫిర్యాదు



ఏఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం ప్రముఖులు

రాయచూరు, మే 11 : దేశంలోని ముస్లింలను జాతి వ్యతిరేకులుగా కీర్తించే ప్రయత్నం చేసిన సువర్ణ న్యూస్ చానల్ యాంకర్ అజిత్ హనుమక్కనవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సమాజానికి చెందిన ప్రముఖులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అడిషనల్ ఎస్పీతో పాటు డీఎస్పీని కలిసి వేర్వేరుగా పలు ముస్లిం సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సామాజిక వేత్త రజాక్ ఉస్తాద్ ఈ నెల 9వ తేదీన రాత్రి 8:30 గంటలకు హిందూవుల జనాభా సంఖ్య తగ్గుతున్నట్లు ముస్లింల జనాభా సంఖ్య పెరుగుతున్నట్లు వార్తను ప్రసారం చేసే క్రమంలో హిందువుల ప్రస్తావన వచ్చినప్పుడు జాతీయ జెండాను చూయించడంతో పాటు ముస్లింల జనాభాను గురించి విశ్లేషించే క్రమంలో పాకిస్తాన్ జెండాను వినియోగించడాన్ని జాతి విద్రోహంగా పరిగణించాలన్నారు. ముస్లింలను ఉద్దేశపూర్వకంగా పాకిస్తాన్ వారంటూ నిందించడం ద్వారా దేశ సమైక్యతకు భంగం కలిగించిన అజిత్ హనుమక్కనవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా ముసుగులో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న అజిత్ హనుమక్కనవర్ గతంలోను అనేక పర్యాయాలు హిందు-ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రీతిలో వార్తల ప్రసారం, చర్చలు జరిపారని పోలీస్ ఉన్నతాధికారులకు వివరించారు.

ఈత కోసం వెళ్లి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు వినాయక్(ఫైల్)

రాయచూరు, మే 11 : రాయచూరు తాలూకా జేగరకల్ మల్లాపూరు గ్రామానికి చెందిన 6 ఏళ్ల బాలుడు వినాయక్ ఈత కోసం వెళ్లి మృత్యువాతపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. గత మంగళవారం ఈ బాలుడు కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని హెంబెరాళ గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లగా అక్కడ స్నేహితులతో కలిసి సమీపంలోని వాగువద్దకు ఈత కోసం వెళ్లాడు. నీరు ఒక్కసారిగా ఎక్కువగా రావడంతో ఈతరాని ఈ బాలుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెళ్లి బాలుడి శవాన్ని బయటికి తీశారు. విషయం తెలుసుకున్న రాయచూరు రూరల్ పోలీసులు సంఘటన స్థళాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిడుగు పాటుకు ఐదు మేకల మృతి

రాయచూరు, మే 11 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా జంగిరాంపూర్ తాండా వద్ద శనివారం పిడుగుపాటుకు వ్యక్తి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సంఘటనలో తాండ సమీపంలో ఒక గుడిశెల్లో ఉన్న ఐదు మేకలు మృత్యువాతపడ్డాయి. కాగా పిడుగుపాటుతో గాయపడిన హనుమంత అనే వ్యక్తిని లింగసుగూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు.

వైభవంగా కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం

కంప్లి, మే 11 : కంప్లి తాలుకా సన్నాపురం పంచాయతీ నారాయణస్వామి క్యాంపులో కోదండరామ ఆలయ 12వ వార్షికోత్సవం మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరిగింది. ఇందులో తిరుమల తిరుపతి దేవస్థాన పురోహితులు(రవి) ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా హోమాలు, చక్ర తీర్థం, పూజ లు, పల్లకిసేవ, ఉయ్యాల సేవ, గోపూజ, తదితర ధార్మిక పూజలు జరిగాయి. ప్రతి ఇంట ఈ ఆలయ వార్షికోత్సవం ఒక పండుగలా నిర్వహించుకున్నారు. ఈ పూజా కార్యక్రమానికి నారాయణ స్వామి క్యాంపు, బసవేశ్వర క్యాంపు, సన్నాపురం, ముద్దాపురం, ఇటిగి, కంప్లి, ఎమ్మిగనూరు, గంగావతి, సింధనూరు, బళ్లారి నుంచి ప్రవాసాంధ్రులు స్వామివారిని దర్శించుకునిమొక్కులు సమర్పించుకున్నారు. మూడు రోజులపాటు కమిటీ పదాధికారులు, యువకమిటీ సభ్యులు సేవలు చేపట్టారు.



ప్రత్యేకాలంకరణలో కోదండ రామస్వామి



హోమాలు చేస్తున్న పురోహితులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

హోసూరు జోన్

కోటమారియమ్మ హుండీ నగదు చోరీ

హోసూరు(క్రైం), మే 11: హోసూరు సమీపంలోని బాగలూరులో పురాతన కోట మారియమ్మ దేవాలయంలోని హుండీ నగదు చోరీకి గురైంది. హోసూరు సమీపంలోని బాగలూరులో సుమారు 500 ఏళ్ల నాటి దేవాలయంలో ఏప్రిల్ నెలల్లో ఆలయ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు కానుక రూపంలో భారీగా నగదు, బంగారం, వెండిని హుండీలో సమర్పించారు. శుక్రవారం రాత్రి పూజారి మహదేవన్ రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక పూజలు ముగించుకుని తాళం వేసి యథాప్రకారం ఇంటికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు ఎప్పటిలాగే ఆలయానికి రాగా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి షాక్‌కు గురై వెంటనే స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పెద్ద హుండీని పగలగొట్టి సుమారు రూ.1.50 లక్షల వరకు చోరీకి గురై ఉంటుందని అంచనా వేశారు. ఘటనపై బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



చోరీకి గురైన కోట మారియమ్మ దేవాలయంలోని హుండీ

ఎండ తీవ్రతపై అప్రమత్తత అవసరం

హోసూరు(కృష్ణగిరి), మే 11: తమిళనాడు రాష్ట్రంలోని చాలా ప్రాంతాలు మే నెలలో సగటు ఉష్ణోగ్రత కంటే ఎక్కువగా ఉంటాయని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. ఏప్రిల్‌తో పోలిస్తే కృష్ణగిరి జిల్లాలో గరిష్టంగా 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రత నమోదైందని, మే నెల రెండోవారంలోనూ 36-40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని తెలిపింది. ఎండతీవ్రత నేపథ్యంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ సూచించింది. ప్రత్యేకించి బాల బాలికలు సంక్షేమం కోసం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించింది. అలాగే ప్రజలు తమ అత్యవసర అవసరాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్ 1077, 04343-234444 రూం టోల్ జిల్లా పోలీసు కార్యాలయ కంట్రోల్ రూం నెం 9498181214 అగ్నిమాపక శాఖ కంట్రోల్ రూం నెంబర్ 101 కి కాల్ చేయవచ్చునని ఓ ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

గంజాయి మొక్కల స్వాధీనం బిహార్ వాసి అరెస్టు

హోసూరు, మే 11: హోసూరు సమీపంలో గంజాయి సాగు చేసిన ఉత్తరాది వాసి యువకుడిని ప్రొహిబిషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. హోసూరు సమీపంలోని కెలమంగళంలోని చిన్నట్టి గ్రామంలో పశువుల దాణా తయారీ కేంద్రం ఉంది. ఇక్కడ గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రొహిబిషన్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు అక్కడకి వెళ్లి పరిశీలించారు. అక్కడ 8 అడుగుల పొడవైన మొక్కలను గుర్తించారు. వెంటనే ఆ మొక్కలను నరికి వేశారు. పోలీసులు విచారణల్లో క్షుణంగా విచారణ చేపట్టారు. బీహార్ రాష్ట్రం పెమ్మారా జిల్లా పంచుసుఖ బస్కి గ్రామానికి చెందిన బుక్కార్యాదవ్ (46) కూలీ పనులు చేసుకుంటూ గత ఏడాది కాలంగా అక్కడే పనిచేస్తున్నట్లు తెలిసింది. కంపెనీకి తెలియకుండా మొక్కలను పెంచినట్లు విచారణలో తేలింది. ఆ మొక్కలను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్ట్ చేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

ప్రజల ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష

తాడిపత్రిటౌన్, మే 11: ప్రజల ఆశీస్సులే మా కుటుంబానికి శ్రీరామరక్ష అని, మీ ఆశీర్వాదాలతోనే మా కుటుంబానికి ఇంతటి పేరు ప్రఖ్యాతులు వచ్చాయని, మీ రుణం తీర్చుకోలేనిదని అనంతపురం జిల్లా తాడిపత్రి టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారానికి చివరిరోజు కావడంతో శనివారం ఆయన విస్తృతంగా బహిరంగసభలు నిర్వహించారు. పట్టణంలోని చిన్నబజారు, ఏటిగడ్డపాలెం, సుంకులమ్మపాలెం, తూర్పుపాలెం, అంబేడ్కర్ సర్కిల్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి, నా తమ్ముడు జేసీ అశ్మిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. గత ఐదేళ్లలో తాడిపత్రిలో అభివృద్ధి పడకేసిందన్నారు. వందలాది పరిశ్రమల మూసివేతతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముందుగా మూతపడ్డ పరిశ్రమలను తెరిపిస్తామన్నారు. విదేశాల్లో మంచి యూనివర్శిటీల్లో చదువుకున్న జేసీ అశ్మిత్‌రెడ్డి కావాలో, చదువురాని వ్యక్తి కావాలో ఒక్కసారి ఆలోచిస్తే మీకే అర్థమవుతుందన్నారు. 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో కూడా మరోసారి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన అంబికా లక్ష్మీనారాయణ, జేసీ అశ్మిత్‌రెడ్డిలకు అండగా నిలవాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. బహిరంగసభల్లో మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి కుమారుడు విరాజ్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు రంగనాథ్‌రెడ్డి, గంగాధర్‌యాదవ్, కౌన్సిలర్ విజ్జి, లక్ష్మీనారాయణ, బింగి ప్రభాకర్, కమలమ్మ, రోషన్న, వరదయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థిని గెలిపించండి: సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పులిచెర్ల లావణ్య ప్రజలను కోరారు. శనివారం మండలంలోని కోమలి, తాతగారిపల్లి గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

మత్తిగిరి వద్ద ఇంట్లో నగదు, నగలు చోరీ

హోసూరు, మే 11: మత్తిగిరి సమీపంలోని కొత్తగొండపల్లిలో ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో చోరీ జరిగింది. భర్తకు అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి తీసుకెళ్లిన భార్య ఆసుపత్రినుంచి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. ఇంటి లోపలికి వెళ్లి చూసే సరికి బీరువాలోని బద్దలు గొట్టి 5 తులాల బంగారు, రూ.20 వేలు నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీఘటనపై సరోజమ్మ స్థానిక మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

గోరంట్ల, మే 11: అనంతపురం జిల్లా గోరంట్ల మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్టును స్థానిక డీఐజీ, ఎన్నికల పరిశీలకుల ఇమ్‌నా లెన్నా శనివారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కర్ణాటక నుంచి మద్యం, నగదు, ఇతర బహుమతి వస్తువులు రవాణాకాకుండా చర్యలు చేపట్టాలని సి బ్బందిని ఆదేశించారు. అనంతరం సమస్యాత్మక గ్రామాలైన కమ్మలవాండ్లపల్లి, వెంకటరమణపల్లి, పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రశాంత పోలింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.